కూలీలకు ఊరట

- ఉపాధి వేతనదారులకు పెరిగిన వేతనం
- మరో రూ.7లు పెంచిన కేంద్ర ప్రభుత్వం

బలిజిపేట:

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు కేంద్ర ప్రభుత్వం కూలిరేటును పెంచింది. ఈ నిర్ణయం అధిక ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్న కూలీలకు కొంత ఊరట నిచ్చినట్లయింది. ఎండల తీవ్రత అధికంగా ఉన్న ఏప్రిల్, మే నెలల్లో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతుంటాయి. ఈ సమయంలో పనులకు వచ్చే కూలీలకు ప్రయోజనం లభించేలా గతంలో కేంద్రం అదనపు భత్యం చెల్లించేది. రెండేళ్లుగా అదనపు భత్యాన్ని నిలిపివేసి, కూలీ రేటును పెంచుతోంది. అందులో భాగంగా తాజాగా దినసరి కూలి మరో రూ.7లు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి తాజా నిర్ణయం అమలులోకి వస్తుంది. దీని ఫలితంగా కూలీలకు లబ్ధి చేకూరనుంది.


ఉపాధి పని చేస్తున్న కూలీలు

రూ.307లకు పెరిగిన కూలి

గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేని కూలీలు వలసలు వెళ్తున్నారు. వలసలను అరికట్టి స్థానికంగా వారికి వందరోజుల పాటు పని కల్పించాలనే ఉద్దేశంతో 2005లో అప్పటి కేంద్రప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టింది. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. జాబ్‌కార్డు కలిగిన వారికి చెరువులు, కాలువలు, మొక్కలు నాటడం, సంరక్షించడం, వ్యవసాయ భూముల సంరక్షణ వంటి పనులను కల్పిస్తున్నారు. ఈ పథకం ప్రారంభంలో రోజు వారీ కూలి రూ.87.50లుగా ఉండగా, నిత్యావసర ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కూలీలకు లబ్ధి చేకూర్చేలా కూలి క్రమంగా పెంచుతూ వస్తున్నారు. 2022లో రూ.12 పెంచగా, 2023లో రూ.15 పెంచారు. గతేడాది అత్యధికంగా రూ.28 పెంచడంతో రోజువారీ కూలి రూ.300లకు చేరింది. తాజాగా మరో రూ.7లు పెంచడంతో ఇది రూ.307లకు చేరింది. ప్రస్తుతం రోజువారీ సగటు కూలి రూ.307 చెల్లిస్తున్నారు.

మండలంలో ఉపాధి హామీ పథకం గ్రూపులు	420
జాబ్‌కార్డులు ఉన్నవారు	14,013 మంది
యాక్టివ్ జాబ్‌కార్డులు సంఖ్య	13,651
వేతనదారులు	18,622 మంది
పనిచేస్తున్న వేతనదారులు	13,613 మంది

పెరిగిన మొత్తం అమలు

ఇటీవల పెరిగిన రూ.7లు అదనపు మొత్తంతో కలిపి రోజుకు సగటు రూ.307 చెల్లించనున్నాం. వేతనదారులు చేపడుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వాటిని అప్‌లోడ్ చేసి పంపించనున్నాం. బిల్లుల చెల్లింపులు వారి ఖాతాల్లోకి జమ అవుతాయి.

–కేశవరావు, ఏపీఓ, బలిజిపేట

రోడ్డు పనులు సకాలంలో పూర్తిచేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రామస్వామి

పార్వతీపురం రూరల్: మండలంలోని అడ్డాపుశీల నుంచి ఎర్రన్నగుడి జంక్షన్ వరకు రహదారి పనులు సకాలంలో పూర్తి చేసి సురక్షితమైన రహదారిని అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రామస్వామి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన కమిటీ సభ్యులతో కలిసి అడ్డాపుశీల నుంచి తోటపల్లి రిజర్వాయర్, ఉల్లిభద్ర, ఎర్రన్నగుడి జంక్షన్ వరకు రోడ్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లు అధ్వానంగా మారగా ఇటీవల పనులు ప్రారంభించి అలసత్వం చేయడంతో వాహన చోదకులకు మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తోందన్నారు. వేగంగా వెళ్లే భారీ వాహనాల కారణంగా దట్టంగా ధూళి పైకి లేచి ప్రజా రవాణాకు సంబంధించిన వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు టి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


అసంపూర్తి రోడ్డు పనుల కారణంగా అవస్థలు పడుతున్న వాహన చోదకులు

ఏటీఎంలలో నగదు లేక ఇబ్బందులు

సీతానగరం: బ్యాంకులకు మూడు రోజులు సెలవుల కారణంగా బ్యాంక్ ఖాతారులకు నగదు అవసరానికి లేకపోతోంది. ఏటీఎం సెంటర్లకు వెళ్లినా నగదు లేక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. సెకెండ్ సాటర్‌డే, ఆదివారం, అంబేడ్కర్ జయంతి కారణంగా సోమవారం వరకు వరుసగా మూడు రోజులు సెలవులు కావడంతో బ్యాంక్ ఖాతాల్లో నగదున్నా రైతులు, వర్తకుల అవసరాలకు నగదు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. చినభోగిలి, మండల కేంద్రంలో మూడు ఏటీఎంలున్నాయి. ఆయా ఏటీఎంలలో నగదు లేకపోవడంతో వెనుదిరగాల్సి వచ్చిందని ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా బ్యాంక్ ఉన్నతాధికారులు స్పందించి ఏటీఎం సెంటర్‌లో నగదు డిపాజిట్‌చేసి ఖాతాదారులను ఆదుకోవాలని కోరుతున్నారు.



మూతపడిన పెదభోగిలి మార్కెట్‌లో ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్

క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖినది తీరాన వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో మూడురోజులుగా లక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షికోత్సవాలు త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనాలతో అర్చకుడు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఆలయ నిర్వాహకులు చెలికాని వెంకట గోపాలకృష్ణ దంపతులు ఆదివారం సమకూర్చిన 100 రకాల పిండివంటల సారె స్వామివారికి అర్చకులు సమర్పించారు. వార్షికోత్సవంలో వందలాది మంది అర్చకులు, వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత


విద్యార్థులతో మాట్లాడుతున్న శక్తి టీం ఏఎస్సై శ్రీనివాస్‌రావు

పార్వతీపురంటౌన్: శక్తి యాప్‌తో మహిళలకు భద్రత లభిస్తుందని శక్తి టీం ఏఎస్సై శ్రీనివాస్ రావు అన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని బాలికల వసతిగృహంలో గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ, విద్యార్థిని, బాలికలు శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకుని చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. సమాజంలో మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు దాడుల నుంచి తమను తాము కాపాడుకునేందుకు ప్రభుత్వం తెచ్చిన శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచం లాంటిదన్నారు. ఆపదలో ఉన్న మహిళలను రక్షించే క్రమంలో ప్రతి మహిళకు శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా 'తిరుపతిరావు'


పంచాయతీ నూతన కార్యవర్గంతో మండల పరిషత్ అధికారులు

సీతానగరం: మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. ఇంత వరకూ మండల పంచాయతీ కార్యదర్శుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా ఉన్న చినభోగిలి కార్యదర్శి పెంట తిరుపతిరావు గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ సంఘానికి ఉత్సాహంగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్న కార్యదర్శుల్లో నూతన ఎన్నికల్లో యునానిమస్‌గా కమిటీ ఎన్నిక జరిగిందన్నారు. మండల అధ్యక్ష కార్యదర్శులు గా రామవరం కార్యదర్శి ఎ.శశిభూషణరావు, కృష్ణారాయపురం కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా బగ్గందొరవలస కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సహాయకార్యదర్శిగా బడే మనోహర్ ట్రెజరర్‌గా పెదంకలాం కార్యదర్శి గౌరీశ్వరి ఎన్నికయ్యారని తిరుపతిరావు తెలియజేశారు. నూతన కార్యవర్గాన్ని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు, ఏఓ ఎంఎల్ఎస్ ప్రసాద్, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అభినందించారు.

చెలరేగిపోతున్న వేటగాళ్లు..

- మృత్యువాత పడుతున్న వన్యప్రాణులు

భామిని: మండలంలో విస్తరించిన తివ్వా కొండల నుంచి తాగునీటి కోసం పల్లపు ప్రాంతాలకు వస్తున్న వన్యప్రాణులు వేటగాళ్ల బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. కొండల నుంచి దిగి వచ్చిన కొండమేకలు, దుప్పిలు, అడవి పందులను వేటగాళ్లు నాటు తుపాకులు, ఐర్రెలు, కర్రలతో దాడి చేసి వాటి మాంసాన్ని విక్రయిస్తున్నారు. కొద్ది నెలల్లోనే పదుల సంఖ్యలో వన్యప్రాణులు వేటగాళ్ల బారిన పడినట్లు సమాచారం. ఇటీవల ఘనసర సమీపంలోని గిరిజన ప్రాంతాల్లో వన్యప్రాణాలను వేటాడినట్లు పలువురు బహిరంగంగా చెబుతున్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

సీతంపేట: మండలంలోని దోనుబాయిలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నీని పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించాలన్నారు. టోర్నీలో 50 టీమ్‌లు తలపడనున్నాయి. కార్యక్రమంలో సీఐ చంద్రమౌళి, ఎస్సైలు వై.అమ్మన్నరావు, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా గ్రావెల్ తవ్వకాలు


అక్రమార్కులు తవ్వకాలు జరుపుతున్న గ్రావెల్ కొండ

- కూటమి నాయకులు అండదండలతో అక్రమ రవాణా
- తహసీల్దార్ కళ్లముందే తరలింపు

సాలూరు రూరల్: ఇటీవల కాలంలో సాలూరు మండలంలో విచ్చలవిడిగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ విషయంలో పూర్తిగా అధికార పార్టీ అండదండలతోపాటు అధికారుల లాలూచీ వ్యవహారం ఉన్నట్లు పెద్దఎత్తున చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు అక్రమ తవ్వకం దారులకు పూర్తి సహకారం అందిస్తున్నారన్న ప్రచారం తారస్థాయికి చేరింది.

వివరాల్లోకి వెళ్తే..

సాలూరు మండలంలోని బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఎదురుగా గ్రావెల్ కొండను అక్రమంగా రాత్రిపూట తవ్వేస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాలకు రెవెన్యూ సిబ్బంది పూర్తిస్థాయిలో సహకరిస్తున్నట్లు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులను మేనేజ్ చేసుకుని తవ్వకాలు సాగిస్తున్నట్లు ఆశాఖ సిబ్బందే చర్చించుకోవడం విశేషం. కొద్దిరోజులుగా బొడ్డవలస గ్రావెల్ కొండను రాత్రి 7 గంటలనుంచి తవ్వడం ప్రారంభించి తెల్లవారుజామున నిలిపివేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటివరకు దాదాపు 150 లోడుల వరకు తరలించినట్లు స్థానికులు స్పష్టం చేస్తున్నారు. ఈ గ్రావెల్ సాలూరు పట్టణం నుంచి తహసీల్దార్ కార్యాలయం ముందు నుంచి తరలిస్తుండడం విశేషం.

ఇంటర్ ఫలితాల్లో వాసవి విజయదుంధుబి

పార్వతీపురం: ఇంటర్మీడియట్ ఫలితాల్లో పార్వతీపురం పట్టణంలోని వాసవి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో ఎస్.హర్షిణి 983 మార్కులు, బైపీసీలో పి.సాయి సంపత్ 983 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో సీహెచ్ రాకేష్, పి.పవన్‌కుమార్, పి.భరత్‌కుమార్‌లకు 470 మార్కులకు గాను 462 మార్కులు, బైపీసీ గ్రూప్‌లో ఎస్.ప్రమీల 440 మార్కులకు గాను 431 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్, చైర్మన్ పీవీకే మణికుమార్ అభినందించి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలో 900 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులు 42 మంది, 400 మార్కులు పైబడి 73 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ పి.సరిత, అధ్యాపకులు ఉన్నారు.


ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులతో వాసవి కళాశాల చైర్మన్ పీవీకే మణికుమార్

సత్తాచాటిన ఆర్‌కే కళాశాల విద్యార్థులు

పట్టణంలోని ఆర్‌కే జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో బి. దీపిక 985, టి.కృష్ణ సృజన 979, ఎస్.మౌనిక 978, డి.సాహు 975, ఆర్.పవన్ కుమార్ 971, పి.శ్రావణ్‌కుమార్ 969, ఎస్. హరిత 967, జి.ప్రసన్న 962 మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో జి.జ్యోత్స్న 950మార్కులు సాధించింది. అలాగే ప్రథమ సంవత్సరం ఫలితాల్లో వి.చాందిని 435(బైపీసీ), జి.దీప్తి 464, కె. షణ్ముఖప్రియ 461, జి.యశ్వంత్ కుమార్ 459, బి.రజని 455, బి.సాయి అమృత 454, వి.జశ్వంత్ 453 మార్కులు సాధించినట్లు కరెస్పాండెంట్ పూడి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సన్మానించి సత్కరించారు.


ఇంటర్‌లో సత్తాచాటిన ఆర్‌కే జూనియర్ కళాశాల

ఇంటర్ ఫలితాల్లో భాను ప్రసాద్ ప్రతిభ


సీతానగరం: చుక్కల భానుప్రసాద్

సీతానగరం: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో మండలంలోని పెదంకలాం గ్రామానికి చెందిన చుక్కల భానుప్రసాద్ (సెకెండియర్ బైపీసీ) 980/1000 మార్కులు సాధించాడు. బూర్జ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ చదివి 519 మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు ఇంటర్‌మీడియట్ ప్రైవేట్ కాలేజీలో చేరాడు. శనివారం ప్రకటించిన ఫలితాల్లో 980 మార్కులు సాధించడం పట్ల కుటుంబసభ్యులు అభినందనలు తెలియజేశారు.

దండాలమ్మ.. నూకాలమ్మ..

- పాచిపెంటలో ప్రారంభమైన అమ్మవారి ఘటాల ఊరేగింపు
- మే 12,13,14 తేదీలలో పండుగ
- 14 ఏళ్ల తరువాత నిర్వహణ

పాచిపెంట: మండల కేంద్రంలో నూకాలమ్మ తల్లి పండగకు సర్వం సిద్ధమైంది. సాధారణంగా ప్రతి పదేళ్లకు ఒక్కసారి జరిగే ఈ పండగను ఈ సారి పద్నాలుగు సంవత్సరాల తరువాత నిర్వహిస్తున్నారు. వచ్చే నెల 12,13,14 తేదీలలో పండగ జరగనున్న నేపథ్యంలో ఆదివారం అమ్మవారి ఘటాల ఊరేగింపు జరిగింది. ఘటాల ఊరేగింపుతో పండుగ ప్రారంభమైనట్లు భక్తులు భావిస్తారు. పండగవరకు అమ్మవారి ఘటాలు నెలరోజుల పాటు గ్రామంలోని వీధుల్లో తిరగనున్నాయి.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేస్తున్నారు.

అంగరంగవైభవంగా నిర్వహించేందుకు

అమ్మవారి పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు గ్రామపెద్దలు, యువత, భక్తులు సమాయత్తమయ్యారు. వేలసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్, పారిశుధ్యం, తాగునీరు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఘటాల ఊరేగింపు ప్రారంభమవడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. గ్రామస్తులు తమ బంధువులు, స్నేహితలకు పిలుపులు పెట్టి తగు ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు.


గ్రామంలో ప్రారంభమైన ఘటాల ఊరేగింపు

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

పార్వతీపురం రూరల్: ప్రతిరోజూ మనకు కావాల్సిన వస్తువులను వివిధ దుకాణాల నుంచి కొనుగోలు చేస్తుంటాం. అలాగే పలు సంస్థల నుంచి ఆర్థిక, వైద్య, ఇతర సేవలు పొందుతుంటాం. కొన్ని సందర్భాల్లో నాసిరకం వస్తువులు, సేవలపట్ల తీవ్రస్థాయిలో నష్టపోతాం. కొన్న వస్తువులు, సేవల్లో లోపాలు తలెత్తినప్పుడు వినియోగదారుల కార్యాలయం దృష్టికి తీసుకువెళ్తే పరిహారం పొందే అవకాశం ఉంటుంది. ప్రజలు వినియోగించే వస్తువులు నాసిరకం లేదా సజావుగా లేకపోతే వినియోగదారుల కమిషన్‌ను సంప్రదించి కొనుగోలు చేసిన వస్తువులు, అలాగే పొందిన సేవలు సజావుగా అందకపోతే నష్టం వాటిల్లకుండా పరిష్కారం జరిగే అవకాశం ఉందని తెలుసుకోవాలి.

ఫిర్యాదు చేసి సాయం పొందవచ్చు



నాణ్యత లేని, కల్తీ సరుకుల విక్రయం, ప్రైవేట్ వైద్యుల నిర్లక్ష్యం, సేవాలోపం, ఆయా సంస్థల్లో బీమా కంపెనీల క్లెయిమ్‌ల విషయంలో ఇబ్బంది పెట్టినా ఏదైనా సమస్య ఎదురైతే అమ్మిన, సేవలందించిన, సంస్థల నుంచి పరిష్కారం కాకపోతే వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేసి సాయం పొందవచ్చు. ప్రతి ఒక్క కొనుగోలు దారు, వినియోగదారుడు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి. ఆహారం, అవసరాలు, వైద్యం తదితరాలపై నష్టపోతున్నట్లు అనిపిస్తే వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించవచ్చు.

– అద్దెపల్లి లక్ష్మీపతిరాజు, న్యాయవాది, పార్వతీపురం

పిడుగుల పట్ల అప్రమత్తం



- రైతులు జాగ్రత్తగా ఉండాలి

పార్వతీపురం: వేసవి ఎండలు తీవ్రం కావడంతో ఒక్కసారిగా సంభవించిన మార్పుల కారణంగా వాతావరణం చల్లబడింది. దీంతో పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన కొద్దిపాటి వర్షం కురుస్తోంది. పొలం పనులకు వెళ్లే రైతులు, రాకపోకలు చేసే ప్రజలు ఉరుములు, మెరుపులు వచ్చినప్పుడు జాగ్రత్తలు తీసుకోకపోతే పలు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ నిపుణులు సూచిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఉరుములు, మెరుపులు వచ్చినప్పుడు చెట్లకింద, చెట్ల సమీపంలో, చెరువుల దగ్గర, సెల్ టవర్ల వద్ద ఉండకూడదు.

- పొలాల్లో పనిచేసే రైతులు, పశువుల కాపర్లు, గొర్రెల కాపరులు, సురక్షితమైన భవనాల్లోకి వెళ్లాలి.
- బహిరంగ ప్రదేశాల్లో ఉన్న షెడ్డుల్లో, ఇంటిపైన ఉన్న చిన్న గదుల్లో ఉండరాదు.
- ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర పరికరాలు, చార్జింగ్‌లో ఉన్న ఫోన్లు, మొబైల్స్ వినియోగించకూడదు.
- మోటార్ సైకిళ్లు, ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, ట్రాన్స్‌ఫార్మర్‌కు వేలాడుతున్న విద్యుత్ తీగలకు ఇతర ఇనుప వస్తువులకు దూరంగా ఉండాలి.
- ఇంట్లో ఉన్నట్లైతే కిటికీలు, తలుపులు మూసివేయాలి.

రైతులు జాగ్రత్తలు పాటించాలి



ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులు, గొర్రెలు, మేకల విషయంలో జాగ్రత్తలు అవసరం. కాయగూరలు, తీగజాతి పంటలు గాలులకు నేలవాలకుండా కర్రలతో ఊతం ఇవ్వాలి. మామిడి రైతులు కూడా పంటలు కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలి.

– అశోక్, మండల వ్యవసాయాధికారి, పార్వతీపురం

భక్తి శ్రద్ధలతో మాను కొమ్మల ఆదివారం


మాను కొమ్మల ఆదివారం పండగ ర్యాలీ

పార్వతీపురంటౌన్: పునీత కార్మిక జోజప్ప దేవాలయంలో మాను కొమ్మల ఆదివారాన్ని చర్చి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే వందలాది మంది భక్తులు తరలిరావడంతో దేవాలయం కిటకిటలాడింది. ఈత కొమ్మలను పూలతో అలంకరించి విశ్వాసులు తమ చేతితో పట్టుకుని యేసు హోసన్న భక్తి గీతాలు ఆలపిస్తూ ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి దేవాలయం వరకు ఊరేగించారు. అనంతరం చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ పండగను గుడ్ ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారం జరుపు కుంటారు. ఈ వారాన్ని పరిశుద్ధ వారంగా పరిగణిస్తారు. ఈ సందర్భంగా ఫాథర్ కె.థోమస్ రెడ్డి భక్తులనుద్దేశించి దైవ సందేశం చేశారు.


దివ్య పూజ బలి సమర్పించిన కథోలిక గురువులు

'ఉపాధి' బిల్లులు చెల్లించండి

జియ్యమ్మవలస రూరల్: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే చెల్లించాలని వేతనదారులంతా కోరుతున్నారు. ఎండలో కష్టపడి పని చేస్తే వారాల తరబడి బిల్లులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ కూలి డబ్బులపై ఆధారపడి జీవించే తమకు ఇలా డబ్బులు ఇవ్వకుండా ఉంటే ఎలా ప్రశ్నిస్తున్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎప్పటి బిల్లులు అప్పుడే అందేవని, ఇప్పుడు నెలలు గడుస్తున్నా ఉపాధి పని డబ్బులు బ్యాంకుల్లో పడడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఎప్పటికప్పటి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విరిగిన రైల్వే గేటు

కొమరాడ: మండంలోని ఆర్తాం గ్రామ సమీపంలోని రైల్వే గేటు ఆదివారం విరిగిపోయింది. దీంతో ఆ దారిలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కూనేరు నుంచి పార్వతీపురం వైపు వస్తున్న ఓ వ్యాన్ బలంగా ఢీకొట్టడంతో గేటు విరిగినట్లు రైల్వే సిబ్బంది తెలిపారు. గేటు మేన్ రైల్వే గేటు దాటి వాహనాలు వెళ్లకుండా ఓల్డ్ గేటు అడ్డంగా ఉంచడంతో గేటుకు ఇరువైపులా వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. దీంతో అందులోని ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. గేటు మరమ్మతులు పూర్తయిన తర్వాతే వాహనాల రాకపోకలు జరుగుతాయని రైల్వే సిబ్బంది తెలిపారు.